క్లుప్తంగా

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

వీపనగండ్ల: మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చే టయాలనుకునే వారు మండపాల ఏర్పాటు వివరాలను ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఏఎస్‌ఐ వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. వివరాలను ఆన్‌లైన్‌లో న మోదు చేసి సంబంధించిన పత్రాలను స్థానిక పోలీసుస్టేషన్‌లో అందజేయాలన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

వీపనగండ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బోదన పరికరాలను ఉపయోగించి నాణ్యమైన విద్యను అందించాలని తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ప్రాథమికోన్నత పాఠశాలలో టీఎల్‌ఎం మేళాలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహ, కాంప్లెక్స్ హెచ్‌ఎం భానుప్రకాష్ పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర

కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక పెద్దమందడి వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా బలిజపల్లి, జంగమాయల్లి గ్రామాలతో పాటు చర్లపల్లిలో శ్రీకృష్ణుడి ప్రతిమతో పెద్దఎత్తున ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో నాగరాజు, రాఘవేంద్రచారి, రమేష్ తదితరులు ఉన్నారు.

'రక్తదానం.. మహాదానం'

వనపర్తిటౌన్: రక్తదానం చేయడం ప్రతిఒక్కరు అలవర్చుకోవాలని జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీ రామ్‌నరేష్ యాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

పుస్తకాల పంపిణీ

కొత్తకోట రూరల్: అయ్యపురెడ్డి కుటుంబ సభ్యులు పెద్దమందడి పాఠశాలలో చదువుతున్న 4, 5వ తరగతి విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివకుమార్, ఎంఈఓ మంజులత, హెచ్‌ఎం శాంతన్న పాల్గొన్నారు.

నెలరోజుల్లో రోడ్డు పూర్తి

అమరచింత: మండలంలోని ధర్మాపురం గ్రామానికి కొత్తగా నిర్మిస్తున్న బీటీ రహదారి పనులు నెలరోజుల్లో పూర్తి కానున్నాయని పంచాయతీరాజ్ శాఖ డీఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ధర్మాపూర్ గేట్ నుంచి గ్రామం వరకు నిర్మిస్తున్న రహదారి పనులను శుక్రవారం ఆయన సందర్శించి పనులను పరిశీలించారు. ఆయన వెంట ఏఈ బ్రూహ్మా పాల్గొన్నారు.

ఘనంగా వన మహోత్సవం

ఖిల్లాఘనపురం: మండలకేంద్రంలో శుక్రవారం ముదిరాజ్ కుటుంబాలు ఘనంగా వనమహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు పోషమ్మ బోనాల ఉత్సవాలు నిర్వహించిన వారు శుక్రవారం కరిని జరుపుకొన్నారు. మహిళలు బొడ్డెమ్మలు ఆడారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

వనపర్తి రూరల్: మండలంలోని మెంటేపల్లి గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మెంటెపల్లి గ్రామానికి చెందిన మంద అకిల్ ఇంటికి తాళంవేసి కుటుంబ సభ్యులతో కలసి ఈ నెల 19న పెబ్బేరులోని బంధువుల పెళ్లికి వెళ్లి రెండురోజులు అక్కడే ఉండిపోయారు. తిరిగి గురువారం రాత్రి గ్రామానికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని గుర్తించారు. వారు ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళాలు పగులగొట్టి తలుపులు తెరుచుకొని ఉండం గమనించి వాటిలో వెతకగా నగదు రూ.10 వేలు చోరీ జరిగిందని బాధితుడు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

ఖిల్లాఘనపురం: కుటుంబ కలహాలతో వ్యక్తిపై దాడి చేసిన వారిపై కేసునమోదు చేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం వసురాంతండాకు చెందిన ముడావత్ గొడ్యానాయక్ ఈ నెల 20న తన ఇంట్లో కూర్చుని ఉండగా ముడావత్ శంకర్, ముడావత్ శ్రీను, ముడావత్ ఘంసి, ముడావత్ అనూషలు ఇంట్లోకి వచ్చి ఇంటినిర్మాణం విషయంలో బూతుమాటలు తిట్టారు. శ్రీను చేతులతో కొట్టాడు. అనంతరం గొడ్యానాయక్ అక్కడి నుంచి మోటర్‌సైకిల్‌పై మండల కేంద్రానికి వెళ్తున్నాడు. పిల్లివాగు దగ్గర పోతుండగా ముడావత్ శ్రీనునాయక్, ముడావత్ రవినాయక్, ముడావత్ నితేష్, ముడావత్ శంకర్‌నాయక్ గొడ్యానాయక్ వాహనానికి అడ్డగించి బలవంతంగా పొలం దగ్గరకు తీసుకెళ్లారు. అక్కడ కుటుంబ విషయాలు మాట్లాడుకుంటుండగా మాటామాట పెరిగి ముడావత్ రవినాయక్ ఫిర్యాదుదారున్ని కొట్టి గాయపర్చాడు. అక్కడి నుంచి వచ్చిన గొడ్యానాయక్ ఈ నెల 21న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

లింక్‌రోడ్డు నిర్మాణమెప్పుడో..?

- 3.కి.మీ. రహదారి నిర్మిస్తే 20 కి.మీ. ఆదా
- శ్రీశైలం వెళ్లేవారికి సులభం
- గత్యంతరం లేక చిన్నంబావి, కొల్లాపూర్ మీదుగా రాకపోకలు
- అధికారులకు విన్నవించి వేసారిన ప్రజలు



బొల్లారం చౌరస్తా వద్ద నిర్మించాల్సిన 2 కి.మీ. బీటీ రోడ్డు

వీపనగండ్ల: ప్రజావసరాల మేరకు రోడ్లను నిర్మిస్తున్న ప్రభుత్వం, అధికారులు పెబ్బేరు పట్టణం నుంచి ప్రత్యామ్నాయ రోడ్డు ద్వారా ముఖ్యపట్టణాలు దైవదర్శనాలకు వెళ్లే భక్తులకు అనువైన రోడ్డును నిర్మించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శ్రీశైలం, అచ్చంపేట, నాయనిపల్లి మైసమ్మ తల్లి దర్శనం కోసం వెళ్లే వందలాది మంది భక్తులకు 3 కి.మీ. ప్రత్యామ్నాయ రోడ్డును నిర్మిస్తే దాదాపు 20కి.మీ. దూరం తగ్గుతుంది. ఎన్నోమార్లు అధికారుల దృష్టికి తెచ్చిన పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు. ఉన్నతస్థాయి అధికారులు స్పందించి ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

2కి.మీ నిర్మిస్తే 20 కి.మీ. ఆదా..

పెబ్బేరు, గద్వాల, అలంపూర్‌తో పాటు ఆంధ్ర ప్రాంతం నుంచి నాయనిపల్లి మైసమ్మతల్లి దర్శనానికి వెళ్లే పలువురు భక్తులకు అనుకూలంగా ఉన్న వెంకటాపురం గ్రామం నుంచి నాగసానిపల్లి, రంగవరం, గోపల్‌దిన్నె, వీపనగండ్ల, బొల్లారం చౌరస్తా, ఎనబెట్ల నుంచి అంకిరావుపల్లి స్టేజి వరకు ఉన్న సింగిల్ బీటీ రోడ్డును డబుల్ బీటీ రహదారిగా మారిస్తే చిన్నంబావి, కొల్లాపూర్ నుంచి వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రత్యామ్నాయ రహదారి ద్వారా వెళితే దాదాపు 20 కి.మీటర్లు ఆదావుతోంది.



గోపల్‌దిన్నె గ్రామ సమీపంలో నిర్మించాల్సిన కిలోమీటర్లు రహదారి

మైసమ్మ దర్శనానికి వెళ్లే రోడ్డులో సింగిల్ బీటీ ఉన్న గోపల్‌దిన్నె గ్రామ సమీపంలో కిలోమీటర్లు బొల్లారం చౌరస్తా వద్ద 2 కి.మీటర్లు మొత్తం మూడు కిలోమీటర్లు మాత్రమే మట్టి రోడ్డు ఉంది. ఈ 3 కి.మీటర్లను కూడా బీటీ రోడ్డుగా నిర్మిస్తే ప్రత్యామ్నాయ రోడ్డు అంతా కూడా సింగిల్ బీటీగా మారి ప్రయాణికులకు అనువుగా ఉంటుంది.

జాతీయ రహదారికి సౌకర్యం..

పెబ్బేరు పట్టణంలోని నేషనల్ హైవే రోడ్డుకు కొల్లాపూర్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సోమశిల, సిద్ధేశ్వరం నూతన హైవేరోడ్లను కలిపేందుకు ఈ ప్రత్యామ్నాయ రోడ్డు ఎంతో అనువుగా ఉంటుంది. గతంలో ఈ రోడ్డును నిర్మించేందుకు ఉన్నతస్థాయి అధికారులు సర్వే కూడా చేసినట్లు తెలుస్తుంది.

రోడ్డు పూర్తయితే ఎర్రబస్సు వసతి

రోడ్డు పూర్తయితే ఎర్రబస్సు ఎరుగని గ్రామాలైన రంగవరం, నాగసానిపల్లికి బస్సు వసతి కలగడమే కాకుండా కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, లింగాల, పెద్దకొత్తపల్లి తదితర ప్రాంతాల ప్రజలకు కర్నూల్‌కు వెళ్లేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

మంత్రి చొరవ చూపాలి :



లింక్ రోడ్డు నిర్మాణంపై మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ చూపాలి. రూ.లక్షలతో రోడ్ల నిర్మాణం కోసం ఖర్చు చేస్తున్న ప్రభుత్వం రోడ్డు మొత్తాన్ని డబుల్ బీటీ రోడ్డుగా మారిస్తే మారుమూల ప్రాంత గ్రామాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.
– బాల్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్, గోపల్‌దిన్నె

సింగిల్ రోడ్డు వసతి ..



బీటీ రోడ్డుగా మారిస్తే ప్రత్యామ్నాయ రోడ్డు సింగిల్ బీటీ రహదారిగా మారుతోంది. గ్రామానికి బస్సువసతి ఏర్పాటై మండల కేంద్రానికి వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది. అధికారులు, ప్రభుత్వం చొరవ చూపి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించాలి.
– సుదర్శన్, మాజీ ఉపసర్పంచ్, రంగవరం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం :

మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చేందుకు అవసరమైన నిధులకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం. ప్రత్యామ్నాయ రోడ్డు ద్వారా రవాణా వసతి పెరిగితే గ్రామీణ ప్రాంత ప్రజలకు మేలు జరుగుతుంది. – మస్తాన్, పంచాయితీరాజ్, ఏఈ వీపనగండ్ల

గ్రామగ్రామాన 'పనుల జాతర'



నూతనంగా నిర్మించిన వంతెనను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ



బహదూర్‌గూడెంలో కంపోస్టుపిట్‌కు భూమిపూజ నిర్వహిస్తున్న అధికారులు

వనపర్తి రూరల్: 'పనుల జాతర'లో భాగంగా శుక్రవారం మండలంలోని అంకూరు, వెంకటాపురం, చిమనగుంటపల్లి, చిట్యాల గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మేఘారెడ్డి శంకుస్థాపన చేశారు. వెంకటాపురం, చిట్యాల, నాచహల్లి గ్రామాల్లో అంగన్వాడీ భవనాలకు అంకూరు గ్రామంలో హైలెవల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా అయినప్పటికి నుంచి 18నెలల్లో రూ.1759 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీలు కిచ్చారెడ్డి పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని నర్సింగాపురంలో శుక్రవారం ఉపాధిహామీ పథకం ద్వారా అంజమ్మ నిర్మించిన పశువుల షెడ్డును మాజీ సర్పంచ్ హనుమాన్‌రావు ప్రారంభించారు. అంతకుముందు తండాలో గోపాల్ నాయక్‌షెడ్డుకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బాలయ్య, పంచాయతీ కార్యదర్శి మౌని గ్రామస్తులు పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: పనుల జాతరలో భాగంగా శుక్రవారం వనపర్తి, పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లోని గ్రామాల్లో నిర్మించిన అధికారులు పలు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. శాఖాపూర్ గ్రామంలో అధికారులకు పలు షెడ్లకు ముగ్గువేసి ప్రారంభించారు.

కొత్తకోట రూరల్: మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని డీసీసీబీ మాజీ డైరెక్టర్ కొత్తకోట పీఏసీఎస్ మాజీ చైర్మన్ రావుల సురేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. 'పనుల జాతర' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కానాయపల్లి గ్రామంలోని పునరావాస కేంద్రంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి మొక్కలు నాటి మొక్కలు నీళ్లు పోశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ్‌కుమార్, మాజీ ఉప సర్పంచ్‌లు లక్ష్మీనారాయణ, గోరయ్య తదితరులు ఉన్నారు.

చిన్నంబావి : 'పనుల జాతర'లో భాగంగా మండలంలోని పెద్దమారు గ్రామంలో పంచాయతీ కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్‌ను ఎంపీడీఓ రామస్వామి సింగిల్‌విండో చైర్మన్ నరసింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలోఏ ధనుంజయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం 'పనుల జాతర' పండుగలను ఘనంగా నిర్వహించారు. బహదూర్‌గూడెం, చింతకుంట గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎంపీడీఓ గోవింద్‌రావు, ఏపీఓ కుర్మయ్య పాల్గొని భూమి పూజ నిర్వహించారు.

'అమృత్' 2.0 పనులు త్వరగా పూర్తిచేయాలి

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న అమృత్ 2.0 పనులను త్వరితగతినా పూర్తి చేయాలని మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అశ్వినికుమార్ అన్నారు. శుక్రవారం బీజేపీ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అమృత్ 2.0 నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆనంద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని మాడల్ స్కూల్ దగ్గర వర్షానికి నీరు నిలవడంతో విద్యార్థులకు పాఠశాలలో వెళ్లలేక నడుచుకుంటూ వెళ్తున్నారని శుక్రవారం ప్రిన్స్‌పాల్ నరేష్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు మున్సిపల్ కమిషనర్ ఖాజకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్స్‌పాల్ చిన్నగోపాల్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించాలి

మదనాపురం: మండల కేంద్రంలో మార్కెట్ భూముల్లో జర్నలిస్టులకు పేదలకు ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో భూములను పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకట్రాములు, పాల్గొన్నారు.

మానాజీపేటకు బస్సులు నడపాలి

ఖిల్లాఘనపురం: మండలంలోని మానాజీపేట గ్రామానికి ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతు మండల బీజేపీ అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ ఆధ్వర్యంలో డీఎంకు వినతిపత్రం ఇచ్చారు. పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తికి వెళ్లిన నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనువాసులు, ప్రధాన కార్యదర్శి శ్రీనువాసులుగౌడ్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మానాజీపేట గ్రామానికి గత 30 సంవత్సరాలుగా బస్సులు తిరిగేవన్నారు. ఇప్పటికైనా గతంలో మాదిరిగా బస్సులు నడపాలని వారు కోరారు.

జ్ఞానాంబికాదేవికి పుష్పార్చన



జ్ఞానాంబికాదేవికి పూజలు చేస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి గ్రామ శివారులో శ్రీ దత్తకోటిలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా శ్రీ జ్ఞానాంబికాదేవీకి సహస్రనామ పుష్పార్చన నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి వేద మంత్రాలతో సంకల్ప పూజలు చేపి పుష్పాలకు పూజలు చేశారు. వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేవారు.

వనదేవతగా దర్శనమిచ్చిన అమ్మవారు

వనపర్తి రూరల్: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా పెబ్బేరు పట్టణంలోని కన్యాకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారు వనదేవతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలతో ప్రతేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మహిళలు కుంకుమార్చన, పలకీసేవ నిర్వహించారు.



పెబ్బేరులో వనదేవతగా..

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వనపర్తి రూరల్: పెబ్బేరు పీఆర్‌టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్1న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మహాధర్నా వాల్‌పోస్టర్‌ను శుక్రవారం పట్టణంలో ఎమ్మార్సీ కార్యాలయం దగ్గర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చిన్నరాములు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయులపై ఉన్న సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దయానంద్, షర్మిష్ఠదేవి, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు కృష్ణయ్యగౌడ్, పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వాలు విఫలం



రైతులతో మాట్లాడుతున్న జబ్బార్

ఆత్మకూర్: యూరియా సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జబ్బార్, మండల కార్యదర్శి జీఎస్ గోపీ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద రైతులతో మాట్లాడి పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సాగు సమయంలో పొలాల్లో ఉండాల్సిన రైతులు యూరియా కోసం రోజుల తరబడి పీఏసీఎస్, ఫర్టిలైజర్ దుకాణాల వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొనడం దారుణమన్నారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా పంపిణీ చేయాల్సిన కేంద్రం.. రాష్ట్రంపై చిన్నచూపు చూడటం సరికాదని తెలిపారు. రైతుల కష్టాలను గుర్తించి వెంటనే యూరియాను సరఫరా చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ శుభ్రం



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ శుభ్రం చేసిన దృశ్యం

పాన్‌గల్: 'పొంచివున్న ప్రమాదం' అనే శీర్షికన ఈ నెల 18వ తేదీన సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ శుభ్రం చేయించారు. పెద్ద చెట్లు, తీగ మొక్కలు, గడ్డి పొదలు, పిచ్చిమొక్కలు, నిండుగా ఉన్న పొదలను తొలగించి శుభ్రం చేయించారు. ప్రమాదం పొంచివున్న విషయాన్ని అధికారులకు తెలిసేలా చేసి వాటిని శుభ్రం చేసేలా కృషి చేసిన సాక్షి దినపత్రికకు తండా వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని పార్టీ మండల కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. శుక్రవారం తెల్లరాళ్ళపల్లితండాలో పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. అలాగే పీహెచ్‌సీలో 24 గంటల వైద్యసేవలకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దేవేందర్, సూర్యవంశంరాము, రాములు తదితరులు పాల్గొన్నారు.

అక్షర యోధుడు షోయబ్ ఉల్లాఖాన్



వనపర్తిలో పాల్గొన్న ఆవాజ్ సంఘం సభ్యులు

వనపర్తి రూరల్: జిల్లా అవాజ్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్‌నగర్‌లో షోయబ్ ఉల్లాఖాన్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జబ్బార్, జిల్లా అధ్యక్షుడు మునీరుద్దీన్ పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిహాల్, ఖలీల్, ఉమా, మహేష్, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలకేంద్రంలో శుక్రవారం షోయబ్ ఉల్లాఖాన్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జబ్బార్ మాట్లాడుతూ.. తెలంగాణా సాయుధ పోరాట యోధుడన్నారు. ఈ కార్యక్రమంలో అంజద్ అలీ పాల్గొన్నారు.

ఘనంగా రాజా బహదూర్ వెంకటరామరెడ్డి జయంతి



కొత్తకోటలో...

కొత్తకోట: రాజాబహదూర్ వెంకట్‌రాంరెడ్డి జయంతిని శుక్రవారం కొత్తకోట పట్టణ కేంద్రంలో రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజాబహదూర్ వెంకట్‌రాంరెడ్డి రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వేముల శ్రీనివాస్ రెడ్డి, పి.కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఆత్మకూర్: ఆత్మకూర్ పట్టణంలో శుక్రవారం రాజాబహదూర్ వెంకట రాంమారెడ్డి జయంతిని రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామలక్ష్మరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐటీఐ ఆస్తులు కాపాడాలి

కొత్తకోట రూరల్: పట్టణ సమీపంలో శ్రీవెంకటేశ్వర ఐటీఐ ఆస్తులను కాపాడాలంటూ పట్టణ వాసులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు తహసీల్దార్ వెంకటేశ్వర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు పొగాకు అయ్యప్ప, రావుల రవీంద్రనాథ్‌రెడ్డి గతంలో సమన్వయంతో ఐటీఐ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇందుకు గానూ కొత్తకోట శివారులో 443 సర్వే నెంబర్‌లో 5 ఎకరాల 6 గుంటల స్థలాన్ని బాలకిషన్‌రావు దగ్గర కొనుగోలు చేశారు. వారికి చెందిన అదే సర్వే నంబర్ 443 లానే ఉన్న ఇతర భూమిని కొంతభాగం వీవర్స్‌కాలనీకి, అదే సర్వేనెంబర్‌లో పూర్తి భూమిని సైతం ఇతరులకు అమ్మివేశారన్నారు. ఆ సమయంలో వీవర్స్‌కాలనీ వారు భూ రికార్డుల్లో పట్టా మార్చుకోవడం వల్ల అమ్మకందారుల పేరుపై ఆస్తి దస్త్రాల్లో అలాగే ఉండిపోయింది. ఆస్తిని సదరు భూ విక్రయదత్త వారసులు ఐటీఐకి కేటాయించిన స్థలంలోకి అక్రమ చొరబాటుకు ప్రయత్నిస్తున్నారు. కావున తమకు పూర్వపు విక్రయ దస్తావేజులు పరిశీలించి, ఆక్రమణకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం పేర్కొన్నారు. ఐటీఐ విద్యా కమిటీ చైర్మన్ విశ్వనాథం గంగాధర్, బోయేజ్, విశ్వేశ్వర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి..



పెబ్బేరులో పాదయాత్రలో బీజేపీ నాయకులు

వనపర్తి రూరల్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు ఆదేశాల మేరకు శుక్రవారం పెబ్బేరు పట్టణ పార్టీ అధ్వర్యంలో పట్టణంలో ఏర్పడిన స్థానిక సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై పాదయాత్ర నిర్వహించి మున్సిపల్ కమిషనర్ వినతిపత్రం అందజేశారు. శ్రీ రంగాపురం మండలంలోని గ్రామాల్లో మండల పార్టీ ఆధ్వర్యంలో గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలపై తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రకౌన్సిల్ సభ్యులు గౌని వేమారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, స్థానికల సంస్థల ఎన్నికల జిల్లా కన్వీనర్ పురుషోత్తంరెడ్డి, ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. పెబ్బేరు పట్టణంలోని రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు త్వరగా ప్లాట్స్ కేటాయించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దివ్యాంగులు, వృద్ధాప్య , వితంతు పింఛన్లు మంజూరు చేయాలన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామరెడ్డి, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు విజయవర్ధరెడ్డి, క్రాంతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరు



మదనాపురంలో బీజేపీ నాయకుల అరెస్టు

పాన్‌గల్: అక్రమ అరెస్టులతో ప్రజాఉద్యమాలను పలేరని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు శివరాంయాదవ్ అన్నారు. డీలర్ల సమస్యలపై బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పిలుపుమేరకు సెక్రటరియేట్ ముట్టడిలో భాగంగా మండల పార్టీ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో నరేందర్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

వీపనగండ్ల: రైతు ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు చేపట్టిన సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన బీజేపీ నాయకులను శుక్రవారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. వారిలో మండల పార్టీ అధ్యక్షుడు నారాయణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ నరేష్‌యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు రాకేష్‌కుమార్ పాల్గొన్నారు.

మదనాపురం: వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకోవాలనీ కోరుతూ శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్‌లో ధర్నా కార్యక్రమానికి వెళుతున్న బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం తగదని మండలాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడితే నిర్బంధించడం ప్రజా సమస్యలపై పోరాడకుండా చేయడం ఈ ప్రభుత్వానికి తగదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

అమరచింత: బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే చలో సెక్రటేరియట్ ముట్టడి కార్యక్రమంలో భాగంగా పట్టణ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులు మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో మున్సిపల్ కార్పొరేషన్‌లో మురుగునీటి నిర్వహణ దెబ్బతినడంతో పాటు వివిధ అంశాలపై సెక్రటేరియట్ ముట్టడిని చేపట్టింది. కార్యక్రమంలో పాల్గొనకుండా పోలీసులు ఇలా అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో భరత్, రఘురామ్, విష్ణు, పాండు, సాంబరు సత్తి పాల్గొన్నారు.



పాన్‌గల్‌లో...